జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం, ఫిబ్రవరి 25, 2026 పేజీలు: 5





### బడుగు, బలహీన ప్రజలపై దాడులు

# అమానుషం

## తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24
(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )
నాగర్ కర్నూల్ జిల్లా మండల పరిధిలోని కుమ్మెర గ్రామ శివాలయంలో జరిగిన ఘటనపై రెండు నెలల చిన్నారి బలైపోవడం అత్యంత విషాదకరమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్లు రాపోలు జయప్రకాశ్, టీ.సురేందర్, బాలలక్ష్మి, సభ్యులతో కలిసి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

-మిగతా 2లో..

### ఇంటర్, టెన్త్ పరీక్షలు నిర్వహణకు

# ఏర్పాట్లు పూర్తి

- -ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
- -పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- -నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 24
(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో టెన్త్, ఇంటర్ పరీక్షలపై సమీక్షా నిర్వహి ంచారు. జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్లు పి అమరేందర్, దేవ సహాయం,

-మిగతా 2లో..

### యూరియా యాప్‌తో సరఫరా

# పారదర్శకం

- - జిల్లాలో ఎలాంటి కొరత లేదు
- -జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24
(ప్రజా జ్యోతి బ్యూరో)
మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఎంఎస్ రాటి ఫర్టిలైజర్ షాప్‌లో జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా డిస్ట్రిబ్యూషన్ యాప్ ద్వారా రైతులకు ఎలా సరఫరా చేస్తున్నారో పరిశీలించి, అక్కడికి వచ్చిన రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ యూరియా యాప్ ద్వారా కొనుగోలు సులభంగా

-మిగతా 2లో..



### ఇంటర్ పరీక్షలకు

# ఊరట

## ఆలస్యంగా వచ్చినా ఛాన్స్!

మహబూబ్‌నగర్ (ప్రజాజ్యోతి)
తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోర్డు కీలక ఊరటనిచ్చింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న “ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదు” నిబంధనలో సడలింపు ఇస్తూ, పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా చేరుకునే విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ టైం ఇవ్వాలని నిర్ణయించింది.
రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి కనీసం గంట ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు.

-మిగతా 2లో..

## బడుగు, బలహీన ప్రజలపై దాడులు

# అమానుషం



గ్రామాన్ని సందర్శించి, ఘటన జరిగిన శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయ వద్ద జరిగిన ఘటన ప్రదేశాన్ని సందర్శించి అక్కడ జరిగిన వివరాలను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో చిన్నారి ఘటన జరిగిన పూర్వాపరాల వివరాలపై ఆరా తీశారు. ఘటన జరుగుతున్న సందర్భంగా హోంగార్డు చిత్రీకరించిన వీడియోను డి.ఎస్.పి బురి శ్రీనివాసులు వీడియోను ఫోన్లో కమిషన్ చైర్మన్ కు చూపించారు. గ్రామంలో రెండు నెలల చిన్నారి సమాధిని సందర్శించి సమాధి వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.
తదనంతరం చిన్నారి తల్లిదండ్రులు గణేష్ మౌనికల ఇంటిని సందర్శించినారు.
ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాట్లాడుతూ మల్లన్న జాతరకు సుమారుగా 10,000 మంది భక్తులు వచ్చారని అధికారులు తమ దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా మండల పరిధిలోని కొమ్మెర ఘటనను రాష్ట్ర బీసీ కమిషన్ అత్యంత ప్రాధాన్యత తీసుకున్నట్లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దేవాదాయ శాఖను పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని కోరినట్లు తెలిపారు. నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తరపున సమగ్ర నివేదికను పంపనున్నట్లు కమిషన్ చైర్మన్ నిరంజన్ ఈ సందర్భంగా వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాల హక్కులను రక్షించడం కమిషన్ బాధ్యత అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిందితులు ఎంతటి



వారినైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల రాష్ట్ర బీసీ కమిషన్ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. దోషులను ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా శిక్షించాల్సిందేనని, పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేసి నిజానిజాలను వెలికితీయాలని ఆయన ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులవివక్షకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో సమానత్వ భావన పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపునిచ్చారు
ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గత మూడు రోజులుగా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను రాష్ట్ర బీసీ కమిషన్ దృష్టికి వివరంగా తీసుకువచ్చారు. బీసీ కమిషన్ చైర్మన్ వెంట అధికారులు తదితరులు ఉన్నారు

## ఇంటర్, టెన్త్ పరీక్షలు నిర్వహణకు

# ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, సంబంధిత శాఖల అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ లకు సూచించారు. పరీక్షల నిర్వహణపై పలు అంశాలను చర్చించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్షల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్నతసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు మూసివేసి, బిఎన్ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణపై వివరాలను జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి వార్షిక పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కి కలెక్టర్ తెలియజేశారు.
జిల్లాలో ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షలుకు ప్రథమ సంవత్సరం 7,557 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 7,616 మంది కలిపి మొత్తం 15,173 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు.

పదో తరగతి పరీక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16, వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 60 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 10,683 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందులో 5,264 మంది బాలురు, 5,394 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 257 ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల మరియు ఇతర మాధ్యమాల పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు వివరించారు.పరీక్షా కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు, త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించామని వివరించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రపరచడం వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు, పరీక్షలు సజావుగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల మధ్య సమన్వయం కొనసాగుతున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఈఓ రమేష్ కుమార్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, డిఎంహెచ్ఓ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ సెక్టోరిల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## యూరియా యాప్‌తో సరఫరా

# పారదర్శకం



జరుగుతోందని, ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావడంలేదని తెలిపారు. గతంలో పనులు మానుకొని యూరియా కోసం క్యూ లైన్లలో నిలబడాల్సి వచ్చేదని, ప్రస్తుతం యాప్ ద్వారా ఎక్కడి నుండైనా బుక్ చేసుకొని సులభంగా తెచ్చుకోవచ్చని తెలిపారు. రాబోయే సీజన్లలో కూడా యాప్ ద్వారానే యూరియా సరఫరా కొనసాగించాలని రైతులు కోరారు.
జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 14,857 బ్యాగుల యూరియా సరఫరాకు సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 82,670 మంది రైతులు 3,09,670 బ్యాగులు బుక్ చేసుకోగా, అందులో 3,07,550 బ్యాగులను సరఫరా చేసినట్లు వెల్లడించారు.
జిల్లాలో కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతులు కూడా యాప్ ద్వారా యూరియా పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియాను పారదర్శకంగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి. రాంపాల్, మహబూబ్‌నగర్ అర్బన్ వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసులు, ఎంఎస్ రాతి ఫర్టిలైజర్ డీలర్ మరియు రైతులు పాల్గొన్నారు

# ఇంటర్ పరీక్షలకు ఊరట

5 నిమిషాల గ్రేస్ టైం
ట్రాఫిక్ సమస్యలు, రవాణా ఇబ్బందుల వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 9:05 వరకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మాత్రమే అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారికి ప్రవేశం ఉండదు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు
పరీక్షలను మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా నిర్వహించేందుకు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, వివరాల్లో పొరపాట్లు ఉంటే ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయడంతో పాటు సెక్షన్ 144 అమలు చేయనున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే మూడు సంవత్సరాల పాటు డిబార్ చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ూ=ూ ప్యాకెట్లు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు.



# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్






**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 24( ప్రజా జ్యోతి)**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన 'ఆతీతీఅజవ 'ఆశ్రీఅజవ' 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ మరియు పోలీస్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లకు కలర్ బ్లైండ్, వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అని అలాంటి వారికి చికిత్స ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ ముఖ్యంగా డ్రైవర్లకు సమస్యలు లేకుండా కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్‌కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా, తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడతాయని ఎస్పీ వివరించారు.

డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ శిబిరం ద్వారా మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ణూ= ఎండి రియాజ్ హూల్ హాక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, జ× శివ శంకర్, =× లు నరసింహ, విజయ్ భాస్కర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లు సునీల్,మల్లికా, సాయి ఆదిత్య, కనిగిరి శేఖర్ టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, =ూ× లు శ్వేత, శిరీష, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు

## జిల్లా ఎస్పీ టీ.శ్రీనివాసరావు



**గద్వాల ఫిబ్రవరి 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లా పరిధిలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు తెలిపారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 163 బి ఎం ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని మొత్తం 14 పరీక్ష కేంద్రాల్లో తేది 25-02-2026 నుండి 16-03-2026 వరకు ప్రతిరోజూ ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయి.ఈ పరీక్షలకు మొత్తం 8,471 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు,నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగడం నిషేధం,పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజూ ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు.విద్యార్థులు పరీక్ష సమయానికి కనీసం అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.ప్రశ్నాపత్రాల రవాణా,భద్రత కోసం ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా,పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# అగ్రకుల రెడ్డి పెత్తందారుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

## దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో చాకలి కులానికి చెందిన కుటుంబంపై అగ్రకుల రెడ్డి పెత్తందారులు దాడి చేసి కొట్టిన సంఘటన మొత్తం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో రెడ్డి పెత్తందారుల అహం భావానికి దౌర్జన్యాలకు పరాకాష్టగా నారాయణపేట పట్టణంలోని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక అభిప్రాయపడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రెడ్లు పెత్తనం కోసం, ఆధిపత్యం కోసం, దళిత వెనుకబడిన కులాలపై చలాయిస్తున్న ఆజమాయిషి ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది అనడానికి ఈ కుమ్మెర గ్రామ సంఘటన నిదర్శనంగా వారు అభిప్రాయపడ్డారు. చాకలి కుటుంబం దేవాలయ ప్రవేశానికి వంద రూపాయలు చెల్లించలేదని ఆ గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 8 మంది రెడ్డిలు మూకుమ్మడిగా దాడి చేశారు. పసిపాపను కాళ్ల దగ్గర ఉంచి కొట్టవద్దని వేడుకున్న మహిళలను పసిపిల్లను కాలితో తన్నడం జరిగింది. తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న పసిపాపను ఆసుపత్రిలో జాయిన్ చేసినప్పటికిని పసిపాప మరణించింది. అగ్రకుల స్వభావానికి కనీస మానవత్వం విలువలు లేకుంటాయి అనడానికి ఈ సంఘటన నిదర్శనంగా మేము అభిప్రాయపడుతున్నాం. చాకలి కులానికి చెందిన కుటుంబం పై దాడి చేసిన వారిని పసిపాప మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయకుండా చాకలి కుటుంబీకుల పైనే అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల తరఫున వారు డిమాండ్ చేశారు. మల్లన్న జాతర సందర్భంగా జరిగిన ఈ సంఘటన ప్రతి జాతరలో పీడిత కులాలపై దళితులపై పరోక్ష ప్రత్యక్ష పద్ధతిన అగ్రకుల భావజాలపరులు జరుపుతున్న దాడులకు నిదర్శనంగా మేము అభిప్రాయపడుతున్నాం. మనువాద విధానాలను ముందుకు తీసుకుపోవడానికి పెత్తందారులు తమ భూస్వామ్య విధానాలను అమలు చేయడానికి జరుగుతున్న కృషిలో భాగంగానే పీడిత కులాలపై దళితులపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ప్రజా సంఘాల వారు పేర్కొన్నారు. చాకలి కుటుంబం పై దాడి చేసి పసిపాప మరణానికి కారణమైన నిందితులు అందరిని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

అగ్రకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు ముఖ్యంగా పేద ప్రజలు ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మేము ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. అగ్రకుల దౌర్జన్యాలను భావజాలాన్ని పేద వర్గ దృక్పథంతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని మేము పేర్కొంటున్నాం .ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఉపాధ్యక్షులు సోఫీ జిల్లా సెక్రెటరీ సందుల రాజు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బండగొండ అర్జున్. కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి. ప్రజా కళా మండలి జిల్లా అధ్యక్షులు రమేష్, సహాయ కార్యదర్శి కే శివకుమార్. అంబేద్కర్ జాతర కమిటీ గౌరవ అధ్యక్షులు పరిగి రమేష్. మరియు నీలకంఠం తదితరులు పాల్గొన్నారు



# ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**మల్దకల్ ఫిబ్రవరి 24(ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్ లో నేటి నుండి జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ నర్సింహులు, డిపార్ట్మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు.నేటి నుండి ఫస్ట్ ఇయర్ 159 విద్యార్థులు,రేపు నుండి సెకండ్ ఇయర్ 65 విద్యార్థులు పరీక్ష రాస్తునట్లు తెలిపారు.విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్ష కేంద్రనికి చేరుకుని ప్రశాంతంగా రాయాలన్నారు. ఎలాంటి అవంచినీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రం ఏరియా లో 144 సెక్షన్ ఉన్నట్లు తెలిపారు.విద్యార్థులు సెల్ ఫోన్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు అన్నారు.విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఉండడానికి టెలీ మానస్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.ఇప్పటికే విద్యార్థులు అందరూ హాల్ టికెట్స్ తీసుకున్నందున సకాలానికి చేరుకోవాలన్నారు.



# ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## కళాశాల ప్రిన్సిపల్ శివ గౌడ్.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి శివ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా కళాశాలలో పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:ద్వితీయ సంవత్సరం విద్యార్థులు -- 69 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు -- 108 మందిప్రైవేట్ అభ్యర్థి -- 1 మంది మొత్తం -- 178 మంది విద్యార్థులు అదేవిధంగా కేజీబీవీ చిన్నంబాయి మండల విద్యార్థులు 28 మంది ఒకేషనల్ విద్యార్థులు మరియు 26 మంది జనరల్ విద్యార్థులు ఈ పరీక్షా కేంద్రానికి హాజరుకానున్నారని వారు అన్నారు అదేవిధంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ కేంద్రంలో 25 ఫిబ్రవరి 2026 నుండి 14 మార్చి 2026 వరకు నిర్వహించబడతాయన్నారు . పరీక్ష సమయం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులను ఉదయం 8:30 గంటల కు పరీక్షా కేంద్రంలోకి చేరుకోవాలని అన్నారు. అందు వల్ల విద్యార్థులు సమ యానికి ముందుగానే ప్రతి విద్యార్థి ఉదయం 8:00 గంటల కళాశాలకు చేరుకోవాలని ఉదయం 9:05 గంటల తర్వాత పరీక్షా హాలులోకి ప్రవేశిం చబడదని అన్నారు.పరీక్షలు ప్రశాంతంగా మరియు క్రమశిక్షణతో నిర్వహించేందుకు పోలీసు భద్రత, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.విద్యార్థులు హాల్ టికెట్ మరియు అవసరమైన పత్రాలతో సమయానికి హాజరై పరీక్షలను విజయవంతంగా రాయాలని అన్నారు.



# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**-చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు**

**-డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ శ్రీదేవి**



**నాగర్ కర్నూల్ : ఫిబ్రవరి 24 ప్రజా జ్యోతి**
చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ ఏ.శ్రీదేవి అన్నారు.మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావ్ కమ్యూనిటీ హాల్లో నేషనల్ ఆదివాసి సంస్థ,ఇంటర్ నేషనల్ జస్టిస్ మిషన్ సంస్థలు సంయుక్తంగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ సౌజన్యంతో బాండెడ్ లేబర్ కు వివిధ చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఏ.శ్రీదేవి హాజరై మాట్లాడుతూ మహారాష్ట్రలోని పర్బాని జిల్లాలో నాగర్ కర్నూల్ మండలం వనపట్ల గ్రామానికి చెందిన గుంపు మేస్త్రి బూష పాక ఎర్రయ్య చెర నుండి తెలకపల్లి మండలానికి సంబంధించిన వలసకూలీలను 2026 జనవరి23 న,డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చొరవతో విడిపించడం జరిగిందన్నారు.అనంతరం వారితో ప్రత్యక్షంగా మాట్లాడుతూ వెట్టిచాకిరి నుంచి ఎలాబయటపడాలో వివరించారు.అదేవిదంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకోకూడదని ఏబాల్య దశలో పిల్లలు అందరూ బడికి వెళ్లి చదవాలని,ఎవరైనా చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి ఒక్కరు లేబర్ కార్డు తీసుకోవాలని లేబర్ కార్డు ఉపయోగాలను వివరించారు.లీగల్ గా సహాయం కావాలంటే మా సంస్థ తరఫున సహాయం అందిస్తామని అన్నారు.అనంతరం ఆధార్ కార్డు,బ్యాంకు అకౌంట్ యొక్క ప్రాముఖ్యతను వివరించి ఆధార్,బ్యాంకు అకౌంట్ లేని వారికి నేషనల్ ఆదివాసి సంస్థ,ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్రోల్మెంట్ చేసారు.కార్యక్రమంలోడిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ రామ్
ఆర్య,సి.డబ్ల్యూ.సి చైర్ పర్సన్ లక్ష్మణ్ రావు,ఏ.ల్ ఓ రాజ్ కుమార్,డి.సి.పీ వో శ్రీశైలం,సి.ఐ శంకర్,ఆదివాసి సంస్థ ఉద్యోగులు,ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఉద్యోగులు,బాండెడ్ లేబర్ పాల్గొన్నారు.

# పసికందును తొక్కి చంపిన వారిని కఠినంగా శిక్షించాలి

**-పెత్తందారి ఆగడాల కు పసి ప్రాణం బలి**
**-సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్**
**-సర్పంచ్ తుకారం రెడ్డి మిగతా నిందితులను వెంటనే అరెస్టు చేయాలి**

చిన్నంబావి, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి):
సీపీఐ(ఎం) చిన్నంబావి మండల కమిటీ ఆధ్వర్యంలో, నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా జరిగిన దురంకార దాడుల్లో పసిబిడ్డ మృతి చెందిన ఘటనను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.కుమ్మెర గ్రామంలో ఫిబ్రవరి 18న దళిత రజక కుటుంబంపై అగ్రకుల పెత్తందారులు దాడి చేయగా, రెండు నెలల పసిబిడ్డ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ఆరు రోజులు గడిచినా ప్రభుత్వం సరైన స్పందన చూపకపోవడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. ఇప్పటివరకు కేవలం ముగ్గురిని మాత్రమే అరెస్టు చేయడం, మిగతా నిందితులను వదిలేయడం వల్ల ప్రజాపాలనలో పెత్తందారుల దౌర్జన్యాలు పెరుగుతున్నాయని అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– నాగర్ కర్నూల్ ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే కుమ్మెర గ్రామాన్ని సందర్శించి గ్రామ సభ నిర్వహించాలని, అంటరానితనం మరియు కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రభుత్వ స్థాయిలో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగం, రూ. కోటి ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు త్వరితగతిన శిక్ష విధించాలని కోరారు.సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా పోలీసు శాఖ అగ్రకుల పెత్తందారులను కాపాడే ప్రయత్నం చేస్తోందని, దాడి చేసిన వారు అధికార పార్టీకి చెందినవారనే కారణంతో వారిని రక్షించేందుకు యంత్రాంగం ప్రయత్నిస్తోందని వెంకటేష్ ఆరోపించారు. కుల దురహంకార దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరాదని, బాధిత కుటుంబానికి అండగా అన్ని వర్గాల ప్రజలు నిలిచారని తెలిపారు. ఘటనకు కారకులైన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, మిగతా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పి. వెంకటస్వామి, ఎస్. రాములు, ఎం. వెంకటస్వామి, శివ, పి. రాములు, జి. రాముడు, చిన్న బాలస్వామి, పరుశు రాముడు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాల పంపిణీ

## మండల విద్యాధికారి జి.సురేష్




**మల్దకల్ ఫిబ్రవరి 24(ప్రజా జ్యోతి):**
స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్ నందు నేడు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు మై విలేజ్ స్కూల్ 5మంత్ర లెర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మండల విద్యాధికారి జి.సురేష్ అందజేయడమైనది.ఈ పుస్తకాలు విషయ అవగాహన కొరకు,క్యూ ఆర్ కోడ్ లతో కూడిన వీడియో కంటెంట్ లతో రూపొందించబడినవని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి గణితం,భౌతిక రసాయన,జీవ శాస్త్రము,సాంఘీక శాస్త్రము లకు సంబందించిన డిజిటల్ పుస్తకాలు అందజేయడమైనది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులు పరీక్షలు ధైర్యంగా రాయండి ఆందోళన వద్దు

## –డాక్టర్. ప్రేమ్ కుమార్



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతీ) ఫిబ్రవరి 24:**
బుధవారం 25 వ తేదీ నుంచి మార్చి16 వరకు జరిగే ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ను విద్యార్థులు ధైర్యంగా రాయాలని అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం యక్తపురం గ్రామ వసి సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ..ఇంటర్ విద్యార్థులు పరీక్షలను సమర్థవంతంగా రాయల్లి పరీక్షలు రాసేటప్పుడు కలిగే భయం ఆందోళన ను వదిలి ప్రశాంత వాతావరణం ప్రశాంతమైన మనస్సుతో. ఎలాంటి కలవరపాటుకు గురి కాకుండా రాయాలి పరీక్షలు మంచిగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అలాగే ఎవరైనా పరీక్షల్లో తప్పిన నిరుత్సాహం చెందకుండా మరో సారి ప్రయత్నించి విజయం సాధించాలని సామజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలియజేశారు.

## మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయం ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టౌన్ పరిధిలో ట్రాఫిక్ నియమాల అమలులో భాగంగా ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడింది.ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా, ఒక ఆటో రిక్షాను నడుపుతున్న మైనర్‌తో పాటు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మరో ఆరు మంది మైనర్లు గుర్తించబడ్డారు. వెంటనే సంబంధిత మైనర్ల తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.మైనర్ డ్రైవింగ్ వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, భవిష్యత్తులో ఎదురయ్యే అనర్థాలపై తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ప్రతి కేసుకు రూ.1500 చొప్పున జరిమానా విధించారు.తల్లిదండ్రులు తమ పిల్లలు వాహనాలు నడపకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ వహించాలని, ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు.



# సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం

## -జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





**నాగర్ కర్నూల్ : ఫిబ్రవరి 24 ప్రజా జ్యోతి**

జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరాలంటే ప్రభుత్వ అధికారులు,ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సరం డైరీని అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆవిష్కరించారు.అనంతరం జిల్లా కలెక్టర్మాట్లాడుతూ టీ.జీ.వో డైరీలో అధికారులకు,ఉద్యోగులకు ఎంతో అవసరమైన సమాచారం పొందుపరచడం అభినందనీయమని అన్నారు.అధికారులు,ఉద్యోగులు అహర్నిశలు శక్తివంచనలేకుండా జిల్లా అభివృద్ధికి,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా కృషి చేస్తూ నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరేలా ప్రతి అధికారి,ఉద్యోగి ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తూ పనిచేయాల్సిన అవసరం ఉందనిఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేసి జిల్లాకు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు పి.రాజశేఖర్,కార్యదర్శిపి.సంజీవ,అసోసియేట్అధ్యక్షుడు,ఎండి.ఖాజమైనుద్దీన్, ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు,ట్రెజరర్ కే.రాజు,జాయింట్సెక్రటరీలు లలిత,అశోక్,సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్,సెక్రెటరీ హరికృష్ణ పాల్గొన్నారు

# కుమ్మెర ఘటనపై చిన్న ఆదిరాల గళమెత్తింది

**- పసిబిడ్డ మృతికి న్యాయం చేయాలని డిమాండ్**
**-అగ్రకుల దాడులపై ఆగ్రహావేశం**
**- మిగతా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని గ్రామస్తుల పిలుపు**



**జడ్చర్ల, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి):**

నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా జరిగిన దాడిలో రెండు నెలల పసిబిడ్డ మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆవేదనకు దారి తీస్తోంది. ఈ సంఘటనను ఖండిస్తూ చిన్న ఆదిరాల గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫిబ్రవరి 18న దళిత రజక కుటుంబంపై అగ్రకుల పెత్తందారులు దాడి చేయగా పసికందు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఘటనకు ఆరు రోజులు గడిచినా ప్రభుత్వం సమగ్రంగా స్పందించలేదని, ఇప్పటివరకు ముగ్గురినే అరెస్టు చేసి మిగతా నిందితులను వదిలేయడం దౌర్జన్యాలకు ప్రోత్సాహమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే కుమ్మెర గ్రామాన్ని సందర్శించి గ్రామసభ నిర్వహించాలని, కుల వివక్ష నిర్మూలనకు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. అధికార పార్టీకి చెందిన వారిని కాపాడే ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలు కూడా వినిపించాయి. కుల దురహంకార దాడులను కఠినంగా అణచివేయకపోతే సామాజిక శాంతి భద్రతలకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొంటూ, మిగతా నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోజ దయాకర్, జ శ్రీశైలం, దీ శ్రీనివాసులు, ఖ వెంకట్ రెడ్డి,ౢా జంగయ్య, కుమ్మరి జగన్, సాకలి రాములు, కెంచే శివశంకర్, సాకలి లక్ష్మయ్య, అల్లాపురం పర్వతాలు, కెంచె శ్రీశైలం, అల్లాపురం రాములు, చాపల ఆంజనేయులు, వీణ బురాన్,గౌరిగే పర్వతాలు, దీ వెంకటయ్య , వీణ అప్సర్, దుబ్బ శ్రీకాంత్, పలువురు నేతలు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల్లో.. వంద ఉత్తీర్ణత సాధించాలి

**- ఏ టి డి ఓ జి నాగరాజు**
**-సిద్ధాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనఖీ**

**అచ్చంపేట ఫిబ్రవరి 24( ప్రజా జ్యోతి)**

సంక్షేమ శాఖ ఏటిడిఓ పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఏటిడిఓ జి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా సిద్దాపూర్ గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను అకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని  క్షుణ్ణంగా కలియ తిరుగుతూ పరిసరాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా ప్రీ ఫైనల్ లో భాగంగా సోషల్ ఎగ్జామ్ రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తూ, పరీక్ష వివరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి స్పెషల్ క్లాస్సెస్ తో పాటు విద్యార్థులకు స్పెషల్ మెనూ అద్భుతుందా లేదా అని ఆరా తీశారు. మధ్య భోజనం చేస్తూ, విద్యార్థులకు మెనూ ప్రకారం స్పెషాలిటీస్ అందుతున్నాయా లేదా అని విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆశా పాఠశాలలోని కిచెన్ డార్మెటరీ వివిధ ప్రాంతాలను కలియ తిరుగుతూ.. పరిశీలించి, అన్ని సవ్యంగా ఉండడంతో ఏటీడీవో జీ నాగరాజు గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మల్లేష్ ను అభినందించారు. ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.



# ఇంటర్ పరీక్షలకు ప్రజలు సహకరించాలి

**-పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి**
**-అమలులో 144 సెక్షన్  డిజేలు నిషేధం**
**-జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ : ఫిబ్రవరి 24ప్రజా జ్యోతి**

నేటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపద్యంలో నాగర్ కర్నూల్ జిల్లాకేంద్రంతో పాటు మండల కేంద్రాలలో పరీక్ష కేంద్రాలవద్దఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని,అలాగే ఎగ్జామ్ సెంటర్ల దగ్గర ఎటువంటి లౌడ్ స్పీకర్లు గాని,డీజే సౌండ్ గాని విద్యార్థులకు పరీక్షలకు భంగం కలిగించేవిధంగా ఉండరాదని జిల్లా ఎస్పీసంగ్రామ్ సింగ్ హెచ్చరించారు.జిల్లాలో లా అండ్ ఆర్డర్ ఇష్యూ వల్ల 144 సెక్షన్ అమలులో ఉందని కావున నలుగురి కంటే ఎక్కువ మంది ఎక్కడాగుమిగూడరాదని గుమిగూడిన యెడల చట్టపరచర్యలు ఉంటాయని,ఇది గమనించి విద్యార్థుల భవిష్యత్తు మీ పై ఆధారపడి ఉంటుంది కావున విద్యార్థులకు ఎలాంటి భంగం కలిగించకుండా జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజలకు సూచనలు చేసారు.

# ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి

**నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ గౌరవ్ కటియార్**

**నారాయణపేట , ఫిబ్రవరి 24:ప్రజా జ్యోతి**

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నీతి ఆయోగ్ డిప్యూటీ సెక్రటరీ,అడిషనల్ మిషన్ డైరెక్టర్ గౌరవ్ కటియార్ సూచించారు. మంగళవారం నారాయణపేట జిల్లాలోని నర్వ ఆస్పిరేషనల్ బ్లాక్ పరిధిలోని పెద్ద కడుమూరు, రాయికోడ్, పాతర్‌చేడ్, నర్వ గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా పెద్ద కడుమూరు గ్రామంలో పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులు ప్రదర్శించిన యోగా ఆసనాలను తిలకించారు. డిజిటల్ క్లాస్‌రూమ్, సైన్స్ ల్యాబ్‌లోని ఆధునిక పరికరాలను పరిశీలించి, ఏఎక్స్ఎల్ బోధనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పఠనాశక్తి పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పీఎం శ్రీ నిధుల మంజూరు, వినియోగంపై కూడా ఆరా తీశారు. అనంతరం రాయికోడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లల అభ్యాస సామర్థ్యాలు, పౌష్టికాహారం సరఫరా వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులు పాడిన గేయాలను విని అభినందించారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, రాష్ట్ర సమన్వయకర్త లోకేష్‌తో కలిసి గ్రామ గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామానికి చెందిన ఫాతిమా బేగం నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వాటా కూడా ఉందని హౌసింగ్ పీడీ శంకర్‌ను ప్రశ్నించగా, ఆయన సమాధానమిచ్చారు.

పాతర్‌చేడ్ గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని సందర్శించి, టీకాల విధానాన్ని పరిశీలించారు. అనంతరం నర్వ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కొత్త భవన నిర్మాణానికి అనుమతుల విషయమై ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు.

